
డిజిట్-మెరిట్



**36,285**

కోట్ల రూపాయలు

రైతు రుణమాఫీ కోసం ప్రభుత్వం ఖర్చు చేసిన మొత్తం. 2014, 2018 టర్ముల్లో 72 లక్షల మంది రైతులకు రెండు పర్యాయాలు రూ.లక్ష వరకు రుణమాఫీ.


థర్డ్ అంపైర్



తాము ఏ పంట ఎంత పండించినా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్న నమ్మకాన్ని రైతుకు కలిగించిన ఏకైక ప్రభుత్వం కేసీఆర్ సర్కార్. తెలంగాణ రైతులు అదృష్టవంతులు. ఏ ఇతర రాష్ట్రంలోనూ రైతులకు ఇలాంటి భరోసా లేదు!

▪ సుధీర్ కుమార్ సుథార్, జేఎన్‌యూ ప్రొఫెసర్

థౌజండ్ వాలా..





కౌంట్ డౌన్ **26**

హైదరాబాద్ | శనివారం 4 నవంబర్ 2023 నమస్తే తెలంగాణ

# తెలంగాణ జైత్రయాత్ర 2023

www.ntnews.com

**5**




## నిరుపేదలకు పెన్నిధి

ఆపద సమయంలో ఆదుకునే పథకం సీఎం రిలీఫ్‌ఫండ్. అనారోగ్యం బారిన పడి వైద్యం చేయించుకోలేని వారికి ఇది మేలు చేస్తుంది. ఆపత్కాలంలో నిరుపేదలకు అండగా నిలవడం ప్రభుత్వ బాధ్యత. ముఖ్యమంత్రి రిలీఫ్‌ఫండ్ నిరంతరం కొనసాగుతుంది. ఉమ్మడి రాష్ట్రంలో పదేండ్లలో 1.85 లక్షల మందికి రూ.750 కోట్లు సాయం చేస్తే, మన తెలంగాణలో ఎనిమిదేండ్లలో నాలుగు లక్షల మందికి రూ.2,000 కోట్ల సాయం అందించాం.

▪ కేసీఆర్

# గాంధీభవన్ ఓ కిరాణా దుకాణం

ఫటాఫట్

**టికెట్ రాలేదని నాగం బీఆర్ఎస్‌లో చేరారా?**

**టికెట్** ఇవ్వలేదనో.. ఇంకో కారణం వల్లనో.. బీఆర్ఎస్‌లో చేరలేదు. కాంగ్రెస్‌లో పెద్దలకు గౌరవం లేదు. నేను ఇప్పటి వరకు ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచా. ఏ ఒక్కసారి పైసలకు టికెట్ కొనుక్కోలే. రేవంత్‌రెడ్డి డబ్బులిస్తేనే సీట్ ఇస్తడట. నేనివ్వలేదు.. నాకు సీటివ్వలేదు. అన్నిటి కన్నా ముఖ్యంగా తెలంగాణ బాగుండాలంటే కేవలం బీఆర్ఎస్‌తో మాత్రమే సాధ్యం. అందుకే ఈ పార్టీలో చేరాను.

**రేవంత్ రెడ్డి సర్వేలు చేసి అభ్యర్థులను ఎంపిక చేశారట! నిజమేనా?**

**ఎక్కడ** చేసిండు సర్వే. ఆ రిపోర్టులు బయటపెట్టమనండి. అంత ధైర్యం ఉందా?! సర్వేలు లేవు.. గిర్వేలు లేవు. కంప్యూటర్ ముంగట కూసోని ఏవో లెక్కలు రాసి ఏఐసీసీని మభ్యపెట్టి నమ్మించిండు.

**రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పుంజుకుందని భావిస్తున్నారా?**

**పుంజుకోలేదు** కానీ.. అధికారంలోకి రావాలని గింజుకుంటుంది. ఎంత చేసినా, ఎంత మొత్తుకున్నా ఆ పార్టీని నమ్మే స్థితిలో ప్రజలు లేరు. ఆ పార్టీ నేతలే కాంగ్రెస్‌ను నమ్మడం లేదు. ఇక ప్రజలేం నమ్ముతారు!



నాగం జనార్దన్‌రెడ్డి

Interview

**గాంధీభవన్ రాజకీయాల గురించి మీ మాటల్లో..**


**అదొక** కిరాణా దుకాణం. అక్కడ జిల్లా అధ్యక్షుల పదవులు, ఎస్సీ సెల్, ఎస్టీ సెల్, బీసీ సెల్ ఇలా రకరకాల విభాగాల అధ్యక్ష పదవులు అమ్ముకుంటరు. ఎన్నికలొస్తే సీట్లు అమ్ముకుంటరు. ఎదుగుతున్న నాయకుల కాళ్లు పట్టుకొని కిందికి గుంజుతరు. అంతా లొల్లి లొల్లి.. అంగడి అంగడి ఉంటది.

**కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తారని తెలియగానే.. బీజేపీ నుంచి ఆహ్వానం అందిందా..?**

**తెలంగాణ** ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు మద్దతిస్తానని మాటిచ్చారు కాబట్టి అప్పుడు బీజేపీలో చేరిన. అక్కడ వ్యవస్థ, నాయకత్వం అంతా గందరగోళంగా ఉంటది. తెలంగాణకు ఏం కావాలన్నది బీజేపీకి తెలియదు. అందుకే ఆ పార్టీలో చేరే ఆలోచన రాలేదు. అక్కడి నుంచి ఆహ్వానం కూడా అందలేదు. తెలంగాణ తెస్త అని మాటిచ్చి.. పోరాడి.. రాష్ట్రం సాధించి, అభివృద్ధి వైపు పరుగులు తీయిస్తున్న నాయకుడు సీఎం కేసీఆర్ నాయకత్వంలో పని చేయాలనిపించింది. నాతో మాట్లాడి నన్ను గౌరవించిన కేసీఆర్ మాట మీద నమ్మకంతో బీఆర్ఎస్‌లో చేరా.

▪ సుంకరి

## ఖుల్లం ఖుల్లా



*రాజకీయ రణరంగం రంగులు మారుతున్నది*
*ఆయారామ్ గయారామ్‌ల వ్యవహారం ముదురుతున్నది*
*నోట్ల సంచులకు టికెట్ల బేరం కుదురుతున్నది*
*ఎన్నికల్లో స్వార్థం పడగవిప్పి వదరుతున్నది*

*అవినీతి, అక్రమాలకు ఆ పార్టీ 'చేయూత'*
*అంతర్గత కుమ్ములాటలకు అచ్చమైన కలబోత*
*అందలమెక్కాలన్న అత్యాశ చానా.. కానీ,*
*ఇంట్లో ఈగల మోత.. బయటేమో పల్లకీల రోత*

... దండమూడి శ్రీచరణ్

special
నమస్తే తెలంగాణ ప్రత్యేక ఇంటర్వ్యూ
Special Interview
special

స్టార్ వాయిస్



- కేసీఆర్ తెలంగాణ ఆత్మగౌరవాన్ని నిలబెట్టారు
- పచ్చదనంతో కళకళలాడుతున్న రాష్ట్రం
- ప్రాజెక్టుల రాకతో వలస బతుకు మారింది
- హైకమాండ్ పార్టీల పాలనలో అనిశ్చితి
- ఇప్పుడు హైదరాబాద్‌లో బందుల్లేవ్, ఇబ్బందుల్లేవ్

# కేసీఆర్‌కు నా సెల్యూట్



**పీపుల్స్‌స్టార్ నారాయణమూర్తి మాటంటే పీపుల్ వాయిస్.. కండలు కరిగించే కార్మికుడి కష్టం ఆయనకు తెలుసు. ఆరుగాలం శ్రమించే కర్షకుడి చెమట విలువ ఇంకా బాగా తెలుసు. నిరుపేద గుండెబరువు తెలిసిన వాడు. కాబట్టే.. ఆ పేదవాడికి అండగా నిలిచిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మనసారా మెచ్చుకుంటున్నారు. రైతును రాజును చేసిన కేసీఆర్‌కు హ్యాట్సాఫ్ చెబుతున్నారు. శ్రామికుల వెతలనే కథలుగా వెండితెరపై ఆయన రెపరెపలాడించిన ఎర్రెర్రని జెండాలు ప్రజల అజెండాను పాలకులకు చేరువ చేశాయి. ఆయన నటించి, నిర్మించిన పోరు తెలంగాణ, వీర తెలంగాణ చిత్రాలు మలిదశ ఉద్యమానికి మరింత ఊపునిచ్చాయి. 'పదేండ్లలో తెలంగాణ బహుముఖీన అభివృద్ధి సాధించింది' అని ఈ ముక్కుసూటి మనిషి నిక్కచ్చిగా చెబుతున్నారు. కేసీఆర్ పాలనతో తెలంగాణకు మహర్దశ పట్టిందని ఆనందం వ్యక్తం చేస్తున్న ఆర్. నారాయణమూర్తితో 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక ఇంటర్వ్యూ..**

**కార్మికుల, కర్షకుల పక్షపాతిగా పేరున్న మీరు.. పదేండ్ల తెలంగాణను ఎలా అభివర్ణిస్తారు?**

**ఎక్కడ** నీరు ఉంటుందో అక్కడే నాగరికత పరిఢవిల్లుతుంది అని చారిత్రక పరిశోధనల ద్వారా తెలుస్తుంది. నీళ్లు ఉన్నప్పుడే ప్రజలు నాణ్యమైన జీవితాన్ని సాగించే పరిస్థితులు ఏర్పడతాయి. దశాబ్దం కిందటి వరకు తెలంగాణ వెనుకబడటానికి కారణం నీళ్లు లేకపోవడమే! నీళ్లు లేక.. పంటలు పండక పల్లెలు ఛిద్రమయ్యాయి. ఆత్మగౌరవం అడుగంటింది. ఆ దశలో కేసీఆర్ గారు ప్రత్యేక తెలంగాణ సాధన కోసం నడుం బిగించారు. నీళ్లు, నిధులు, నియామకాలు, ఆత్మగౌరవం ఈ మహోన్నత లక్ష్యాలు సాధించాలనే సంకల్పంతో అడుగు ముందుకు వేశారు. పుష్కర కాలం అలుపెరగని పోరాటం చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారు. సాధించిన రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టారు.

**'మన నీళ్లు మనకే' అని ఉద్యమ సమయంలో కేసీఆర్ తరచూ ప్రస్తావించే వారు కదా! ఆ దిశగా ఆయన సఫలమయ్యారనే భావిస్తున్నారా?**


**తెలంగాణ** ఉద్యమం నీళ్లు.. నిధులు.. నియామకాలు..! అందుకే రాష్ట్రం సిద్ధించిన వెంటనే సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి దృష్టి సారించారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, సీతారామ లాంటి ప్రాజెక్టుల నిర్మాణం కొనసాగించారు. కృష్ణా, గోదావరి నీళ్లతో తల్లి తెలంగాణ పులకిస్తున్నది. మూడున్నరేండ్లలో కాళేశ్వరం పూర్తి చేసి తెలంగాణను సస్యశ్యామలం చేశారు. 'భూమికి పచ్చాని రంగేసినట్టు..' అన్న పాట చందంగా నేడు రాష్ట్రం పచ్చదనంతో కళకళలాడుతున్నది. తెలంగాణను 'రైస్ బౌల్ ఆఫ్ ఇండియా' అని శాస్త్రజ్ఞులు కొనియాడుతున్నారంటే అది కేసీఆర్ గారి ఘనతే! ఒకప్పుడు వరి ఎక్కువగా పండే ప్రదేశాలు అంటే తూర్పు గోదావరి, తమిళనాడులోని తంజావూరు, పంజాబ్‌లో కొన్ని ప్రాంతాల పేర్లు వినిపించేవి. కానీ, నేడు తెలంగాణలోని వరంగల్, కరీంనగర్ ఆ మాటకొస్తే వలసల జిల్లాగా పేరున్న పాలమూరు గురించి మాట్లాడుతున్నారు. ఇంతటి ప్రగతి సాధించడం చెప్పినంత తేలిక కాదు. ఈ ఘనతకు కారణమైన కేసీఆర్ గారికి నేను సెల్యూట్ చేస్తున్నా. ఆయన చేపట్టిన జలయజ్ఞానికి భగవంతుడు కూడా తోడై నేడు తెలంగాణ దేశానికే అన్నం పెట్టే దశకు వచ్చింది.

**ప్రాజెక్టులతోనే ఈ మార్పు సాధ్యమైందని అంటారా..?**

**ముమ్మాటికీ!** భౌగోళికంగా దక్కన్ పీఠభూమి ప్రాంతంగా ఉన్న తెలంగాణలో వ్యవసాయం వర్షం మీదనే ఆధారపడి ఉండేది. మబ్బులను నమ్ముకొని రైతులు పంటలు వేసేవాళ్లు. సరిగ్గా వర్షాలు కురవకపోతే.. ఆ ఏడాదంతా కరువే! వేలమంది రైతులు వందల అడుగుల లోతు బోర్లు వేసినా నీళ్లు పడేవి కావు. మెదక్, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల నుంచి వేల మంది రైతులు బతుకుదెరువు కోసం వలస బాటపట్టారు. తెలంగాణ కర్షకులు ముంబయిలో కార్మికులుగా కనిపించేవారు. ఎప్పుడో పండుగల సందర్భంలో సొంత గ్రామాలకు వచ్చిపోయే దుర్భర పరిస్థితులు ఉండేవి. చేనేత కార్మికుల పరిస్థితులు మరింత అన్యాయం. సిరిసిల్ల ప్రాంతంలో వందలాది మంది నేతన్నలు ఉరి పోసుకున్న వార్తలు ఎన్నో చదివినం. భీవండీ, సూరత్ వెళ్లి బతికేవాళ్లు. నీళ్ల రాకతో రైతులు బాగుపడ్డారు. ఊళ్లు బాగుపడ్డాయి. వ్యవసాయంతోపాటు దానికి అనుబంధంగా ఉన్న అన్ని రంగాలూ మెరుగయ్యాయి.

### ▪ ప్రపంచ స్థాయి నిర్మాణం

**ప్రపంచంలోనే** అతిపెద్ద ఎత్తిపోతల పథకం కెనడాలో ఉంది. ఇప్పుడు కాళేశ్వరం ఆ రికార్డును అధిగమించింది. కెనడాలోని ప్రాజెక్ట్‌ను ఓ దేశం నిర్మిస్తే... కాళేశ్వరాన్ని కేంద్రంతో ఏమాత్రం సంబంధం లేకుండా తెలంగాణ ప్రభుత్వమే స్వయంగా నిర్మించుకుంది. ఇదొక అరుదైన అచీవ్‌మెంట్. కేవలం మూడున్నరేండ్లలో ఈ స్థాయి ప్రాజెక్ట్‌ను పూర్తిచేయడం ముఖ్యమంత్రి దార్శనికతకు నిదర్శనంగా చెప్పొచ్చు. ఇప్పుడు తెలంగాణలో ఎక్కడ నేలను తవ్వినా కొన్ని ఫీట్ల లోతునే నీళ్లు ఎగజిమ్ముతున్నాయి. పదేండ్లలో మన దగ్గర భూగర్భ జలాలు నమ్మశక్యం కాని రీతిలో గణనీయంగా పెరిగాయని కేంద్ర ప్రభుత్వమే అధికారిక నివేదిక అందించింది. ఇదీ అభివృద్ధికి నిజమైన చిహ్నం.



**రైతుబంధు దుబారా అని కాంగ్రెస్ నాయకులు విమర్శిస్తున్నారు కదా! ఆ మాటలు ఎంత వరకు సబబు?**

**కేసీఆర్** విజన్ ఉన్న నేత. వ్యవసాయం దండగ అన్న చోట దాన్ని పండుగలా చేశారు. ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త, కీర్తిశేషులు ఎం.ఎస్.స్వామినాథన్ వంటి గొప్ప వ్యక్తి.. 'రైతులకు మీరు చేస్తున్న మేలు చూసి నా హృదయం పులకిస్తున్నది. మీరు నిజమైన రైతుబాంధవులు. మీరు నిండు నూరేండ్లు బతకాలి' అంటూ కేసీఆర్‌గారిని ఆశీర్వదించారు. ఆ ప్రశంసను భారతరత్న అవార్డుతో సమానంగా భావించొచ్చు. రైతుబంధు ద్వారా రైతులకు ముందే పెట్టుబడి ఇవ్వడం అనేది ప్రపంచంలోనే తొలిసారి. ఈ పథకాన్ని ఐక్యరాజ్య సమితి సైతం ప్రశంసించింది అంటే దాని గొప్పదనాన్ని అర్థం చేసుకోవచ్చు. కేసీఆర్ గారు చూడటానికి డిక్టేటర్‌లా కనిపించొచ్చు. కానీ ఆయన భోళా శంకరుడు. ఆయనలో గొప్ప మానవీయ కోణం కనిపిస్తుంది. నిరంతరం ప్రజలకు ఏదో మేలు చేయాలనే తపనతో ఉంటారు.

**తెలంగాణ కరెంట్ ఉండదని అప్పట్లో కొందరు దుష్ప్రచారం చేశారు. మీకూ అలాంటి అపోహ ఉండేదా?**

**నెవర్!** ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడితే తెలంగాణ అంధకారం అవుతుందని అప్పటి సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి భయపెట్టారు. కానీ నేడు అన్ని రంగాలకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నది. రైతులకు 24 గంటల నాణ్యమైన కరెంట్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం మన తెలంగాణ. మహారాష్ట్రలోని కొందరు రైతులు కూడా తాము తెలంగాణలో కలిసిపోతామని కోరుతున్నారంటే ఇక్కడి పరిస్థితులు ఎంత అద్భుతంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. తెలంగాణ ఏర్పడితే ఏమైపోతుందో అన్న భ్రమలన్నిటినీ రాష్ట్రం సిద్ధించిన ఏడాదిలోనే ముఖ్యమంత్రి పటాపంచలు చేశారు. పదేండ్లుగా రాష్ట్రం ప్రగతి పథంలో కొనసాగుతున్నది. ఈ అభివృద్ధి ఇలాగే కొనసాగి, కేసీఆర్‌గారి సారథ్యంలో తెలంగాణ లక్ష్యం సాకారం కావాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నా.

**తెలంగాణ ఏర్పడితే శాంతిభద్రతలు సమస్యగా మారుతాయని కొందరు వాదించారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఎలా ఉందంటే మీరేం చెబుతారు?**

**మూడు** దశాబ్దాల కిందట హైదరాబాద్ పేరు చెబితే మతకలహాల భయం వెంటాడేది. నిత్యం ఏదో అల్లర్లు, తరచూ కర్ఫ్యూలు. ప్రజలు అభద్రతా భావంతో ఉండేవారు. గతంలో ముఖ్యమంత్రి పీఠం కోసం సొంత పార్టీ వాళ్ల మధ్యే ఘర్షణలు, హైకమాండ్ ఆధీనంలో రాష్ట్ర పరిపాలన ఉండటంతో రాజకీయ అనిశ్చితి కనిపించేది. శాంతిభద్రతలు కూడా గాడి తప్పేవి. ఈ రోజు పరిస్థితులన్నీ మారిపోయాయి. ఈ పదేండ్లలో చిన్న ఘర్షణ కూడా చోటు చేసుకోలేదు. ప్రజలంతా సేఫ్‌గా ఉన్నారు. గంగా జమునా తెహజీబ్ అన్న చందంగా నేడు ఇక్కడి ప్రజలు ఆనందంగా ఉన్నారు. సమాజంలోని ప్రతి మనిషీ శాంతి, స్వేచ్ఛ, సుస్థిరత కోరుకుంటారు. ఇవాళ హైదరాబాద్‌తో పాటు తెలంగాణ సమాజం మొత్తం శాంతియుతంగా జీవనం సాగిస్తున్నది. ప్రభుత్వం ఎంతో పరిశ్రమ చేయబట్టి ఇంతటి మార్పు వచ్చింది! కేసీఆర్ హిందూ ముఖ్యమంత్రి అయినా అన్ని మతాల వారిని సమదృష్టితో చూస్తూ ప్రజారంజకమైన పాలన చేస్తున్నారు. అన్నింటికన్నా ముఖ్యంగా తెలంగాణలో రాజకీయ సుస్థిరత ఉండటం వల్లే ఈ స్థాయి అభివృద్ధి సాధ్యమవుతున్నది.

**అప్పటి, ఇప్పటి హైదరాబాద్‌ను మీరెలా పోలుస్తారు?**

**నేడు** దేశంలోని మెట్రో నగరాలన్నింటినీ అధిగమిస్తూ హైదరాబాద్ అభివృద్ధిలో దూసుకుపోతున్నది. మనం హైదరాబాద్‌లో ఉన్నామా లేక అమెరికాలో ఉన్నామా అనే భావన కలుగుతున్నది. ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేందుకు ఫ్లై ఓవర్స్‌ను భారీగా నిర్మించారు. ఐటీ పరిశ్రమల వల్ల విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయి. విదేశీ సంస్థలు తమ పెట్టుబడులకు గమ్యస్థానంగా హైదరాబాద్‌ను ఎంచుకుంటున్నాయి. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా హైదరాబాద్ నిలుస్తున్నది. కేటీఆర్ ఆలోచనా దృక్పథం, కార్యదీక్షల వల్లే నేడు హైదరాబాద్ ప్రభ వెలిగిపోతున్నది. అమితాబ్‌బచ్చన్, సన్నీ దేవల్ వంటి బాలీవుడ్ నటులు సైతం అవకాశం వస్తే తాము హైదరాబాద్‌లోనే స్థిరపడతామని చెబుతున్నారంటే నగర అభివృద్ధి ఏ స్థాయిలో ఉందో ఊహించుకోవచ్చు.

... కళాధర్‌రావు జూలపల్లి